# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 15 జూలై 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 342





**రికవరీ నోటీసులపై తెలంగాణ సీఎస్ శాంతి కుమారి కీలక ఆదేశాలు**


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# ప్రభుత్వాన్ని పడగొడతామన్నారు..

## వాళ్లంతా ఎక్కడ..



**బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతీ నెలా రూ.ఏడు వేల కోట్లు వడ్డీ చెల్లిస్తున్నాం'**

**హైదరాబాద్:** తెలంగాణలో మా ప్రభుత్వాన్ని పడగొడతామని కామెంట్స్ చేసిన వాళ్లు అడ్రస్ లేకుండా పోయారని సెటైరికల్ కామెంట్స్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఇదే సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేల చేరికపై రేవంత్ తొలిసారిగా స్పందించారు.కాగా, సీఎం రేవంత్ ఆదివారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు మా ప్రభుత్వాన్ని పడగొడతామన్నారు. మూడు నెలలు కూడా ఈ ప్రభుత్వం ఉండదన్నారు. మా పని అయిపోయిందన్న వాళ్లు ఇప్పుడు కనిపించకుండా పోయారు. వారంతా ఎక్కడున్నారు. వాళ్ల పార్టీలో ఎవరు ఉన్నారు.. ఎవరు లేరో అని లెక్కలు చూసుకుంటున్నారు అని ఎద్దేవా చేశారు.ఇదే సమయంలో మా పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు ఇచ్చేందుకు నా దగ్గర ఏమీ లేదు. ఒక్క అంగీ, లాగు తప్ప. మా ప్రభుత్వ ఆలోచనా విధానం, అభివృద్ధి చూసే వారంతా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. బీఆర్ఎస్

నేతలు ప్రభుత్వాన్ని పడగొడతామని చెబుతుంటే.. మరోవైపు ప్రభుత్వాన్ని మేం నిలబెడతామని ఎమ్మెల్యేలు పార్టీలో

- మిగతా 2వ పేజీలో

# త్వరలో మరో డీఎస్సీ

**5 వేలకు పైగా పోస్టులుండే అవకాశం**

**నిరుద్యోగులెవరూ ఆందోళన చెందవద్దు**

**ప్రస్తుత డీఎస్సీ రాసి ఉద్యోగాలు పొందండి**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**




**హైదరాబాద్:** ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం త్వరలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. నిరుద్యోగులు ప్రస్తుత డీఎస్సీ పరీక్షలకు బాగా సిద్ధమై 11 వేల ఉపాధ్యాయ పోస్టులను పొందాలని, ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే మరో నోటిఫికేషన్ జారీచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, పీసీసీ అధికార ప్రతినిధి లోకేశ్ యాదవ్, గిడ్డంగులు, విత్తనాభివృద్ధి సంస్థల ఛైర్మన్లు నాగేశ్వరరావు, అన్వేష్‌రెడ్డిలతో కలిసి గాంధీభవన్‌లో భట్టి మీడియాతో మాట్లాడారు. "ప్రస్తుతం పరీక్షలు జరగబోతున్న డీఎస్సీ నోటిఫికేషన్‌కు స్పందించి 2.79 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే 2.05 లక్షల మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరికి ఏవైనా సమస్యలు ఎదురైతే పరిష్కారానికి 24 గంటలూ అందుబాటులో ఉండేలా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశాం. ఈనెల 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు నిర్వహిస్తాం. పాఠశాలలపై మేం లోతుగా అధ్యయనం చేయగా ప్రస్తుతం వెలువరించిన 11వేల పోస్టులు భర్తీ అయిన తర్వాత కూడా మరో ఐదు వేల ఖాళీలు ఉంటాయని తేలింది. వీటితోపాటు సమీప భవిష్యత్తులో ఏర్పడే మరికొన్ని ఖాళీలను కలిపి మరో డీఎస్సీ నిర్వహిస్తాం. నిరుద్యోగ ఉపాధ్యాయులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మా ప్రభుత్వం తరచూ డీఎస్సీ నోటిఫికేషన్‌లు జారీచేస్తూనే ఉంటుంది. తెలంగాణ బిడ్డలు జీవితాల్లో స్థిరపడాలనేదే మా ఆశ

ఇటీవల రాష్ట్రంలో 19 వేల మందికిపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. ఏ చిన్న ఇబ్బంది లేకుండా 34 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాం. జాబ్ క్యాలెండర్ విడుదల ప్రక్రియను వేగవంతం చేశాం. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో గ్రూప్ 1, గ్రూప్ 2, డీఎస్సీ ఉద్యోగాలనే భర్తీ చేయలేదు. అప్పట్లో సీఎల్పీ నేతగా నేను పలుమార్లు ప్రభుత్వాన్ని అసెంబ్లీలో డిమాండ్ చేయగా నిరుద్యోగులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. చివరికి అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్‌లు ఇస్తే పరీక్ష పేపర్ లీకయింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గ్రూప్ 1 ప్రిలిమ్స్‌ను విజయవంతంగా నిర్వహించాం. గత ప్రభుత్వం గ్రూప్-2 పరీక్షను మూడుసార్లు వాయిదా వేసింది. మేం వచ్చే నెలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రూప్-3 పరీక్షలు వచ్చే నవంబరులో నిర్వహించేందుకు తేదీలు ఖరారు చేశాం. తెలంగాణ బిడ్డలు జీవితాల్లో స్థిరపడాలనేదే మా ప్రభుత్వం ఆశ. డీఎస్సీ పరీక్షలు బాగా రాసి ఉపాధ్యాయులుగా ఎంపికై ప్రభుత్వ పాఠశాలల్లోని పేద బిడ్డలకు విద్యాబుద్ధులు నేర్పాలనేది మా ప్రభుత్వం కోరిక" అని ఉప ముఖ్యమంత్రి భట్టి చెప్పారు.

**ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం త్వరలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు.**




## అభివృద్ధిపై పొన్నం ప్రభాకర్, గంగుల కమలాకర్ తోనూ చర్చిస్తాం

**తన జన్మభూమి అయిన కరీంనగర్ గడ్డ రుణం తీర్చుకుంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.**

**కరీంనగర్:** తన జన్మభూమి అయిన కరీంనగర్ గడ్డ రుణం తీర్చుకుంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆయన్ను కరీంనగర్‌లో కార్పొరేటర్లు సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. కరీంనగర్‌కు నిధులు తెచ్చే బాధ్యత తనదన్నారు. ఈ ప్రాంతాన్ని అద్దంలా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇక్కడి అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్, భారాస నేత గంగుల కమలాకర్‌తోనూ చర్చిస్తామని చెప్పారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా మిగిలిన నిధులు త్వరలో మంజూరు చేయిస్తామని బండి సంజయ్ వివరించారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం..



**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని పలు చోట్ల ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురుస్తోంది. మరో గంటసేపు కూడా భారీ వర్షం కురిసే ఛాన్స్ ఉండటంతో జీహెచ్ఎంసీ సిబ్బంది అలర్ట్ అయ్యారు. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు.కాగా, నగరంలో పలుచోట్ల భారీ వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో ట్విట్టర్ వేదికగా జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి.. నగరంలో మరో గంటసేపు కుండపోత వర్షం కురిసే అవకాశముందని, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. వర్షానికి సంబంధించి అత్యవసర సహాయం కోసం 040-21111111, 9000113667 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

## జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌పై సుప్రీంకోర్టుకు కేసీఆర్



**హైదరాబాద్:** జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ అంశంలో భారాస అధినేత కేసీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కమిషన్ పంపిన సమన్లపై హైకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరపనుంది. విద్యుత్ కమిషన్‌ను రద్దు చేయాలంటూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు సీజే ధర్మాసనం కొట్టేసిన విషయం తెలిసిందే.

# ప్రభుత్వాన్ని పడగొడతామన్నారు..



చేరుతున్నారని అన్నారు.ఇక, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలనే ఓఆర్ఆర్, ఐటీ, ఫార్మా, అంతర్జాతీయ విమానాశ్రయాలను తీసుకువచ్చిందన్నారు. కానీ, బీఆర్ఎస్ మాత్రం రాష్ట్రంలోని గంజాయిని తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేని వాళ్లు.. ఆరు నెలల్లో మేము ఏదీ చేయలేదని మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతీ నెలా రూ.ఏడు వేల కోట్లు వడ్డీ చెల్లిస్తున్నాం' అంటూ కామెంట్స్ చేశారు.



## రికవరీ నోటీసులపై తెలంగాణ సీఎస్ శాంతి కుమారి కీలక ఆదేశాలు

హైదరాబాద్: సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతోన్న అనర్హులకు నోటీసులివ్వడంపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. సంక్షేమ పథకాల్లో అనర్హులు లబ్ధి పొందినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, త్వరలోనే అర్హులే లబ్ధి పొందేలా స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేస్తామని వెల్లడించింది. మార్గదర్శకాలు ఇచ్చే వరకు రికవరీ నోటీసులు ఇవ్వొద్దని సీఎస్ శాంతి కుమారి అధికారులకు సూచించారు. అనర్హులకు లబ్ధి, రికవరీపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు.రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉండే పేద కుటుంబాల వారికి అందాల్సిన ఆసరా పింఛన్లు దుర్వినియోగమవుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వోద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ కుటుంబ పింఛను పొందుతున్న వారు సైతం 'ఆసరా' పొందుతున్నట్లు వెల్లడైంది. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణలో బయటపడిన వారికి ఈ పింఛను రద్దు చేయడంతో పాటు గతంలో పొందిన మొత్తాన్ని రికవరీ చేయాలని ఆదేశించింది. అయితే, ఈ వ్యవహారంలో ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసే వరకు రికవరీ నోటీసులు ఇవ్వొద్దని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు.

# కట్టుకున్నోడే కాలయముడు..

**భార్య, ఇద్దరు పిల్లల్ని హతమార్చిన వైద్యుడు అరెస్ట్**

**ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో తల్లి, ఇద్దరు కుమార్తెల మృతిపై మిస్టరీ వీడింది.**






రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో తల్లి, ఇద్దరు కుమార్తెల మృతిపై మిస్టరీ వీడింది. భర్త బోడా ప్రవీణ్ కుమార్.. భార్య, ఇద్దరు పిల్లల్ని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్టు పోలీసులు తేల్చారు. 45 రోజుల తర్వాత శవపరీక్ష నివేదికలో ఈ విషయం నిర్ధరించారు. విషం కలిపిన ఇంజక్షన్ ఇచ్చి భార్యను హత్య చేసినట్టు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది.మే 28న బాబోజితండాకు చెందిన డా.బోడా ప్రవీణ్, తన భార్య కుమారి(25), కుమార్తెలు కృషిక (4), తనిష్క(3)తో కలిసి కారులో మంచుకొండ నుంచి హర్యాతండాకు బయలుదేరారు. గ్రామం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే కారు ప్రమాదానికి గురైంది. అకస్మాత్తుగా అడ్డు వచ్చిన కుక్కను తప్పించబోయి కారు రహదారి పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. అనంతరం రహదారిపై వెళు న్నవారు కారులోని వారిని బయటకు తీశారు. అప్పటికే కృషిక, తనిష్క మృతి చెందారు. అపస్మారక స్థితిలో ఉన్న కుమారిని 108 అంబులెన్సు సిబ్బంది ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే కుమారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనలో ప్రవీణ్‌కు స్వల్ప గాయాలవ్వడంతో అతన్ని బంధువులు ఆటోలో మరో ఆసుపత్రికి తరలించారు. భర్త ప్రవీణే చంపి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడని మృతురాలి బంధువులు ఆరోపించారు. కుమారి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ముగ్గురి మృతదేహాలపై గాయాలు కనిపించకపోవడంతో వారు అనుమానాలు వ్యక్తం చేశారు. ఘటన జరిగిన రోజు పోలీసులు కారును తనిఖీ చేయగా.. ఖాళీ సిరంజ్ దొరికింది. దాన్ని ఎఫ్ఎస్ఎల్‌కు పంపించగా.. విషం కలిపిన ఇంజక్షన్ ఇచ్చినట్టు తేలింది. ప్రవీణ్ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా.. అందులో కూడా కీలక ఆధారం లభ్యమైంది. అధిక మోతాదులో మత్తు ఇంజక్షన్ ఇస్తే ఎన్నిగంటల్లో చనిపోతారనే విషయాలను ప్రవీణ్ గూగుల్‌లో సెర్చ్ చేసినట్టు గుర్తించారు. పోస్టు మార్టం నివేదిక, ఎఫ్ఎస్ఎల్ నివేదిక ఆధారంగా నిందితుడిపై హత్యకేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఏసీపీ తెలిపారు.

# జిజిఎచ్‌లో ఘనంగా బోనాల పండుగ.

## - నెత్తిన బోనమెత్తిన డాక్టర్ ప్రతిమ రాజ్.










**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 14:**

ప్రతి ఏడాది ఆషాడమాసంలో నిర్వహించే బోనాల పండుగను ఆదివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ పాల్గొని, బోనం ఎత్తుకున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లోని బంగారు మైసమ్మ వరకు డప్పు సప్పుల్లతో ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ అమ్మవారికి వస్త్రాలు, ఒడి బియ్యం లాంఛనాలను సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతిమరాజ్ మాట్లాడుతూ, సాంప్రదాయకరంగా మన పండుగలను నిర్వహించి మన సంస్కృతిని కాపాడాలని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లోని బంగారు మైసమ్మ అమ్మవారు చాలా శక్తి కలదని, మొక్కిన మొక్కులు తప్పక తీర్చే అమ్మవారు అని ఆమె అన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించడం చాలా ఆనందదాయకంగా ఉందని తెలిపారు. ఆ దేవత దయవలన ప్రజలందరూ సుఖ సంతోషాల తో ఆయురారోగ్యైశ్వర్యముల తో వర్ధిల్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.





ప్రజాభవన్‌లో బోనాల ఉత్సవాలు

# బోనం ఎత్తిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 14:**



కోటగల్లిలోని కోటమైసమ్మ బోనాలు, గాండ్ల సంఘం వారు నిర్వహించిన బోనాల పండుగ ఊరేగింపు కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్ పాల్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయ పండుగలలో ఒకటని, బోనాల పండుగని రాష్ట్ర వ్యాప్తంగా ఆశడమాసంలో ప్రజలందరు భక్తి శ్రద్దలతో బోనం చేసి అమ్మవారిని కొలవడం అనవయితీగా వస్తుందని అన్నారు. ,భక్తి శ్రద్దలతో అమ్మవారిని పూజలు చేసి, నైవేద్యం సమర్పించడం జరుగుతుందని, సకాలంలో వర్షాలు కురిసి రైతన్నలు అధిక పంటలు పండించాలని, పిల్లజల్లా, గొడ్డు గోదా అన్నింటిని కాపాడాలని అమ్మవారిని పూజించడం జరుగుతుందని అన్నారు. స్వయంగా అమ్మవారే తమ ఇంటికి వచ్చినట్లు భక్తులందరు భావిస్తారని అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే అని పేర్కొన్నారు. అమ్మవారు ఇందూర్ నగర ప్రజలందరిని అష్టఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంచాలని, ఆ అమ్మవారి ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు.

ఈ కార్యక్రమంలో కోట మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు, 25 వ డివిజన్ కార్పొరేటర్ సిరి గాద ధర్మపురి, 25 వ డివిజన్ బిజెపి శక్తి కేంద్ర ఇంచార్జ్ పల్నాటి కార్తీక్, హరీష్ రెడ్డి, సుగంధం హరీష్, భాస్కర్, గాండ్ల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# భూ సదస్సులకు బిఎల్ఎఫ్ పిలుపు.

**రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల28 నుండి ఆగస్టు 28 వరకు.**
**బిఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ వెల్లడి.**

**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, జులై 14**



తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలకు పట్టాలు, స్వంత స్థలం ఉన్న వారికి ఐదు లక్షల రూపాయల రుణం సహాయం అందించాలని డిమాండ్ చేస్తూ భూ సదస్సులు నిర్వహిస్తున్నట్టుబహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్ఎఫ్) రాష్ట్ర చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ తెలిపారు. ఈ నెల 28 నుండి ఆగస్టు 28 వరుకు జిల్లా కేంద్రాల్లో నిర్వహించే భూ సదస్సులను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని నల్లకుంట లో గల బహుజన లెఫ్ట్ పార్టీ( బిఎల్ పి) రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కేసీఆర్ పది సంవత్సరాల పాలనలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం, సాగు భూములకు పట్టాలు ఇస్తామని వాగ్దానం చేసి తెలంగాణ సమాజాన్ని మోసం చేసిందని విమర్శించారు.

2023లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానం ప్రకారం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, పేదల స్వాధీనంలో ఉన్న ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేసి, స్వంత స్థలం ఉన్న వారికి ఐదు లక్షల రూపాయల రుణం సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా రాష్ట్రంలో ప్రభుత్వ భూముల్లో భూమి లేని పేదలకు మూడెకరాల భూమి పంపిణీ చేయాలని కోరారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పైన పేర్కొన్న సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ జులై 28 నుండి ఆగస్టు 28 వరుకు రాష్ట్రవ్యాప్తంగా భూ సదస్సు నిర్వహించాలని రాష్ట్ర కమిటి నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు గాదగోని రవి, బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ లు దండి వెంకట్, వనం సుధాకర్, నూనె వెంకట్ స్వామి, కె.పర్వాతాలు, సైదులు, రాష్ట్ర నాయకులు సబ్బని లత, ఎస్. సిద్ధిరాములు, ఎం.ఎం. గౌడ్, పడకంటి రామ్ బాబు, మారోజు సునీల్ కుమార్, నర్సయ్యలు పాల్గొన్నారు.





# నగర శివారులో కారు బీభత్సం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 14:**

**ఇద్దరు మహిళలు మృతి.**
**ఇద్దరు విద్యార్థినులకు గాయాలు.**

నగర శివారులోని దాస్ నగర్ వద్ద ఆదివారం కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న పలువురుపైకి కారు దూసుకెళ్లగా, ఇద్దరు మహిళలు మృతి చెందారు. మరో ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ అజాగ్రత్త నడపడం వల్లే ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఇందల్వాయి మండలం సిర్నాపల్లికి చెందిన పోశవ్వ(50) అక్కడికక్కడే మృతి చెందగా, బోధన్ మండలానికి చెందిన పద్మ (35) ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణాలు కోల్పోయింది. మరో ఇద్దరు విద్యార్థినులు సైతం ప్రమాదంలో గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

# బీసీ కులగణనను వెంటనే చేపట్టాలి.

**- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జులై 14:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కులగణనను వెంటనేచేపట్టాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని టీఎన్జీవో భవనంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ,బీసీలకు దూరమైనందునేఇటీవలి ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ రాలేదని అన్నారు. భాష, జాతులపరంగా లెక్కలు ఉన్నప్పుడు కులగణన ఎందుకు చేయడంలేదనిప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, నాయకులు ఆకుల ప్రసాద్, గంగాకిషన్, రవీందర్, దేవేందర్, వినోద్ కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సుకు విద్య ఉపయోగపదాలి.

**అవోపా అధ్యక్షులు సంతోష్ కుమార్.**
**ప్రతిభ కనబరిచిన 19 మంది ఆర్య వైశ్య విద్యార్థులకు సిల్వర్ మెడల్స్.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జులై 14:**




విద్యార్థులు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే విద్యను అభ్యసించాలని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) అధ్యక్షులు సంతోష్ కుమార్ అన్నారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ( అవోపా ) కామారెడ్డి ఆధ్వర్యంలో 2023, 2024 సంవత్సరాలలో ఎస్ఎస్ సి, ఇంటర్ లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 19 మంది విద్యార్థులకు సిల్వర్ మెడల్స్ తో ఆదివారం సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా అవోపా అధ్యక్షులు సంతోష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ నైపుణ్యాన్ని స్వలాభంతో పాటు సమాజ శ్రేయస్సుకు కూడా దోహదపడే విధంగా భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకోవాలని అన్నారు. కీర్తిశేషులు కొమ్మ మల్లయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు కొమ్మ జ్ఞానేశ్వర్ సిల్వర్ మెడల్స్ ను అందించడం హర్షనీయమని అన్నారు.




కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇరిగేషన్ ఈఈ మల్లేష్ మాట్లాడుతూ, పదవ తరగతి ఇంటర్మీడియట్ లలో వచ్చిన మార్కులతో అతిగా ఆనందపడవద్దని అలాగే బాధపడవద్దని అన్నారు. తాను కూడా ఇంటర్మీడియట్ వరకు బిలో యావరేజ్ స్టూడెంట్ నని తర్వాత పట్టుదలతో చదివి అంచలంచలుగా ఎదిగి నేడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నానని అన్నారు. ప్రధాన కార్యదర్శి తృప్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా చదివిన ప్రతి విద్యార్థి విజయం సాధిస్తాడని, సన్మానం పొందుతున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకొచ్చే విధంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక కార్యదర్శి బెజగం గంగ ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థి జీవితం కీలకమైనదని ఒక రంగం అనే కాకుండా అన్ని రంగాలలో సర్వతోముఖాభివృద్ధి పొందే విధంగా విద్యార్థులు కృషి చేయాలని, ఆ దిశగా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవోప కామారెడ్డి పూర్వ అధ్యక్షులు టి కృష్ణమూర్తి, గంగా ప్రసాద్, సలహాదారు శ్రీధర్, పూర్వ కార్యదర్శి శ్రీధర్ లతో పాటు కార్యవర్గ సభ్యులు సత్యసేన, ప్రవీణ్, మహేష్, సంతోష్, శరత్, శ్రీనివాస్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కాలినడకన తిరుమల చేరుకున్న అమరావతి రైతులు

తిరుమల:రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించడంతో ఆ ప్రాంత రైతులు కృతజ్ఞతగా చేపట్టిన పాదయాత్ర ఆదివారం తిరుమల చేరుకుంది. ఉదయం అలిపిరి కాలినడక మార్గంలో కొబ్బరికాయలు కొట్టి 'జై ఆంధ్రప్రదేశ్, జై అమరావతి' అంటూ నినాదాలు చేస్తూ రైతులు తిరుమల చేరుకున్నారు. రాజధాని పరిధిలోని వెంకటాయపాలెంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి 30 మంది రైతులు గత నెల 24న 'అమరావతి రక్షణ, ఆంధ్రప్రదేశ్ సంరక్షణ' పేరుతో పాదయాత్ర ప్రారంభించారు. 21 రోజులపాటు దాదాపు 433 కిలోమీటర్లు నడిచి ఆదివారం అలిపిరి కాలినడక మార్గం మీదుగా తిరుమల చేరుకున్నారు. సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకోనున్నట్లు రైతులు తెలిపారు.